కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 20, పచ్చిమిర్చి 40, బెండ 50, కాకర 50, దొండ 60, దోస 40, ఆలు 35, చామ 60, కీర 40, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 50, చిక్కుడు 50, ఉల్లి 60, ములక్కాయలు (3) 50, క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 80, వెల్లుల్లి రూ. 400 ప్రకారం ధర పలుకుతున్నాయి.

శుభాకాంక్షలు



శేరిలింగంపల్లి: తెలంగాణ ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ గురువారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను కలిసి శాలువాతో సన్మానించి, పూల బోకే అందజేశారు.

కేలండర్ ఆవిష్కరణ



మాదాపూర్: ఆర్యవైశ్య సంఘం మాదాపూర్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆవిష్కరించారు. ఆర్యవైశ్య సంఘం మాదాపూర్ అధ్యక్షుడు కె.బాలరాజు, ప్రధాన కార్యదర్శి కొండూరు మురళి, కోశాధికారి దొడ్ల సుధాకర్ పాల్గొన్నారు.

రేపు ఎంజీఐటీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఇందులో పాల్గొంటారని సంబంధిత వర్గాలవారు తెలిపారు. పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మియాపూర్: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మాణిక్యం సమాచారం మేరకు... మియాపూర్ మదీనాగూడలోని వెంకటేశ్వరస్వామి ఆలయ కమాన్ సమీపంలో ఈ నెల 15న మధ్యాహ్నం గుర్తుతెలియని వాహనం ఓ వ్యక్తిని ఢీకొంది. ఆ వ్యక్తి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. ఆ వ్యక్తిని అంబులెన్స్‌లో పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి చికిత్స అందించారు. బుధవారం మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. చుట్టుపక్కల ఆ వ్యక్తి గురించి ఆరా తీయగా ఎలాంటి సమాచారం లభించలేదు. ఆ వ్యక్తి సుమారు 55–66 సంవత్సరాల వయస్సు ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఆ వ్యక్తిని గుర్తించినట్లయితే మియాపూర్ పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

రేపు తైలాభిషేకం

మోతీనగర్: శని త్రయోదశి సందర్భంగా కబీర్ నగర్, మోతీనగర్ ఎక్స్‌టెన్షన్, అవంతినగర్‌లోని శివ రామాంజనేయ ఆలయంలోని శనీశ్వరస్వామికి శనివారం తైలాభిషేకం, తిలాదానం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తైలాభిషేకం, శనిగ్రహ దోష నివారణ చేసుకునే వారు ఆలయంలో సంప్రదించాలని కోరారు.

అన్నదానం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ, ఎన్‌టీఆర్ నగర్‌లోని సాయిబాబా ఆలయంలో గురువారం హారతి పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా భక్తుడు సందీప్ నానమ్మ కొండ్రెడ్డి రత్నం ప్రథమ వర్ధంతి సందర్భంగా భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కేపీహెచ్‌బీకాలనీ: పేకాడుతున్న ఏడుగురు వ్యక్తులను కేపీహెచ్‌బీ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీనివాస కాలనీలోని బీఎంఆర్ హైట్స్, ఫ్లాట్ నెంబర్ 302లో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు రైడ్ చేసి పేకాడుతున్న డి. రాము, ఆర్.వంశీ, సీహెచ్. రాజేష్, జి. మనోహర్, డి. వెంకట శివరామరాజు, ఏ. శ్రీహరిరాజు, జి. సీతారామరాజులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.42,420, ఏడు సెల్ ఫోన్లను, తొమ్మిది సెట్ల కార్డ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

మది దోచే చిత్రాలు

మాదాపూర్ అయ్యప్ప సొసైటీ అండర్ బ్రిడ్జి గోడలపై 16 ప్రాంతాల్లోని మార్కెట్ల చిత్రాలు



మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీ అండర్ పాస్ బ్రిడ్జి గోడలపై కళాకారులు వేసిన చిత్రాలు

- సంస్కృతీసంప్రదాయాలతో కూడిన సందేశాత్మక చిత్రాలు
- భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలి
- సామాజ సేవకుల జీవిత చిత్రాలు వేయాలి: కళాకారులు

మాదాపూర్: ఫ్లై ఓవర్, అండర్ పాస్ బ్రిడ్జిల గోడలపై కళాకారులు అందమైన చిత్రాలను వేసి చూపరులను ఆకట్టుకుంటున్నారు. మాదాపూర్ పరిసర ప్రాంతాలలో ఉన్న అండర్‌పాస్, ఫ్లైఓవర్ బ్రిడ్జిల గోడలు, పిల్లర్లపై కళాకారులు అందమైన చిత్రాలను వేసి చూపరుల హృదయాలను దోచుకుంటున్నారు. సందరీకరణలో భాగంగా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను తెలిపేలా బతుకమ్మ, పోతరాజులు, పేరిణి నాట్యాలతో పాటు మరిన్ని చిత్రాలను వేస్తున్నారు.

- మాదాపూర్ ప్రాంతం ఐటీ కంపెనీలకు నిలయంగా ఉండటంతో గోడలపై టెక్నాలజీని తెలిపేలా కళాకారులు చిత్రాలను వేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, సామాజిక సేవలు అందించిన ప్రముఖుల చిత్రాలు అద్భుతంగా పిల్లర్లపై వేస్తున్నారు.
- అయ్యప్ప సొసైటీకి వెళ్లే అండర్ పాస్ బ్రిడ్జి గోడలపై జేఎన్ఏఎఫ్‌యూ విద్యార్థులు నగరంలోని ప్రధాన కూడళ్లు, మార్కెట్‌లను చిత్రరూపంలో పెయింటింగ్ వేస్తున్నారు. మోహింజా మార్కెట్, కోఠి, సుల్తాన్ బజార్ లాంటి 16 ప్రాంతాల్లోని వివిధ రకాల మార్కెట్‌ల చిత్రాలను వేస్తున్నట్లు కళాకారులు తెలిపారు.
- ప్రధాన కూడళ్లలో ఉన్న గోడలపై అర్థం లేని చిత్రాలను వేయడం కన్నా దేశ సంస్కృతి, సంప్రదాయలు, సమాజ సేవ చేసే ప్రముఖుల జీవిత చిత్రాలను తెలిపేలా వేయాలన్నారు. వేసిన చిత్రాలు భావితరాలకు స్ఫూర్తిగా ఉండాలని తెలిపారు. కొన్ని ప్రాంతాలలో అర్థంలేని బొమ్మలను వేసి ఎలాంటి సందేశం లేకుండా చేస్తున్నారన్నారు. ప్రతి చిత్రం చూపరులకు సందేశాత్మకంగా ఉండాలన్నారు.



సందేశాత్మకంగా ఉండాలి



చాలా మంది చిన్నారులకు మార్కెట్, బజార్‌లు, ప్రముఖల పేర్లు తెలియదు. అలాంటి వారికి గోడలపై వేసిన చిత్రాల గురించి ప్రయాణ సమయంలో తల్లిదండ్రులు వివరించాలి. ప్రముఖులు చేసిన సామాజిక సేవల గూర్చి వివరించేలా వారి జీవిత చిత్రాలను వేసేలా అధికారులు ఆలోచించాలి. పలు చోట్ల జీవిత సత్యాలను తెలిపేలా కొటేషన్లు రాస్తే బాగుంటుంది.

– మురళీకృష్ణ, జేఎన్ఏఎఫ్‌యూ, ద్వితీయ సంవత్సరం

గోడలపై చాలా కష్టం



చిన్నచిన్న చిత్రాలు వేయడం కన్నా పెద్ద పెద్ద గోడలపై, మెట్రో పిల్లర్లపై చిత్రాలను వేయడం చాలా కష్టం, కచ్చితమైన కొలతలతో చిత్రం సైజును బట్టి లైన్స్ గీసుకుని చిత్రాలను గీయాలి. ఏకాగ్రత, చిత్రాలు గీయాలనే ఆసక్తి ఉన్నప్పుడే చిత్రాలు అద్భుతంగా వస్తాయి.

– శ్రీవల్లి, జేఎన్ఏఎఫ్‌యూ, ద్వితీయ సంవత్సరం

జగంపేట ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

జిన్నారం (పటాన్‌చెరు): మండల పరిధిలోని జగంపేట ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నేత సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వెంకటేశం గౌడ్, భోజరెడ్డి, శంకరప్ప, బండి శ్రీకాంత్ గౌడ్, మహేందర్ గౌడ్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సన్మానం

రామచంద్రాపురం (పటాన్చెరు): ఇటీవల బంగ్లాదేశ్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలో వెండి పతకం సాధించిన నవనీత్ ను గురువారం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సంఘం నాయకులు డాక్టర్. వీరవెల్లి ఉమామహేశ్వరరావు, అశ్విన్ కుమార్ మాట్లాడుతూ.. నవనీత్ ఈనెల 17 తేదీ నుంచి 21వ తేదీ వరకు బంగ్లాదేశ్ లో జరిగిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలో పాల్గొని వెండి పథకం సాధించినందుకు తమ సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సాంబశివుడు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అభిషేక మహోత్సవం

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు సమీపంలోని గోదా రంగనాయక స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు రంగనాయక స్వామికి అభిషేక మహోత్సవం, జనవరి 8వ తేదీన దీపోత్సవం, 10న వైకుంఠ ఏకాదశి, 11న కుడార్త్రై, 13న గోదా రంగనాయక స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి సన్మానం

శేరిలింగంపల్లి: బాడ్మింటన్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారుడిని భెల్ ఉద్యోగులు సన్మానించారు. గురువారం శేరిలింగంపల్లి భెల్ ఎంఐజీ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాడ్మింటన్ క్రీడాకారుడు నవనీత్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో ఉగాండ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో బ్రాంజ్ మెడల్, ఈజిప్టు ఇంటర్నేషనల్ బాడ్మింటన్ టోర్నమెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. అలాగే ఈ నెల 21 తేదీన బంగ్లాదేశ్‌లో జరిగిన పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించడంతో భెల్ ఉద్యోగులు, కాలనీవాసులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నవనీత్ తల్లిదండ్రులు అనంత,



నవనీత్‌ను సన్మానిస్తున్న భెల్ ఉద్యోగులు

బి.ఎన్.శ్రీనివాస్‌తోపాటు డాక్టర్ వి.ఉమామహేశ్వరరావు, అశ్వినికుమార్, శ్రీనివాస్, సాంబశివుడు, గుత్తుల వెంకటేశ్వరరావు, గుత్తుల గోపాలకృష్ణ, సూర్య, అర్జున్‌రావు, నాగేశ్వరావు, మునీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల సహకారం అభినందనీయం



ఆర్వో ప్లాంట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

- గ్రామాల అభివృద్ధిపై ఎమ్మెల్యే గూడెం
- రుద్రారం గ్రామంలో రూ.1.68 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

పటాన్‌చెరు: గ్రామాల అభివృద్ధిలో పరిశ్రమలు భాగస్వాములు కావడం అభినందనీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలో తోషిబా పరిశ్రమ సహకారంతో రూ.1.68 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పల్లె దవాఖాన భవనం, మూడు ఆర్వో ప్లాంట్లను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం రూ.60 లక్షలు గ్రామపంచాయతీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె దవాఖానాలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ప్రతీ పల్లె దవాఖానాలో వైద్యుడితోపాటు ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. భవిష్యత్తులోనూ గ్రామాభివృద్ధికి తోషిబా సంస్థ సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండు, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు హరిప్రసాద్‌రెడ్డి, రాజు, వెంకన్న, తోషిబా సంస్థ ప్రతినిధి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యజమాన్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు సిఖ్ చావునీలోని గురు నానక్ హై స్కూల్ గ్రౌండ్‌లో క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు ఎం.ప్రభాకర చారి, ప్రధాన కార్యదర్శి జి.శరవణ్‌కుమార్, కోశాధికారి ఎస్.ఆర్.రజనీకాంత్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శులు బోయ లక్ష్మణ్, వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, విశ్రాంత ఎస్పీ ప్రీతం సింగ్‌లు ఈ పోటీలను ప్రారంభిస్తారన్నారు. ఫ్యాన్సీ డ్రెస్, డ్రాయింగ్, పెయింటింగ్, వ్యాసరచన పోటీలతో పాటు క్యారమ్స్, చెస్, స్పెల్ బీ, అథ్లెటిక్స్, షాట్‌పట్, మోనో యాక్షన్, వక్తృత్వ పోటీలు, కబడ్డీ పోటీలను నిర్వహిస్తామన్నారు. బాల బాలికలకు విడి విడిగా పోటీలు ఉంటాయన్నారు. జూనియర్స్, సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో పోటీలు ఉంటాయన్నారు. ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు హైదరాబాద్ స్కాట్స్ స్కూల్‌లో నిర్వహించనుండగా... మిగతా పోటీలన్నీ గురు నానక్ హై స్కూల్‌లో నిర్వహిస్తామన్నారు. రాజేంద్రనగర్ మండలంలో ఉన్న గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల నుంచి 4000 మంది విద్యార్థినీవిద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొంటారని వారు వివరించారు.

అధికారుల నిర్లక్ష్యం సరికాదు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో సమస్యల పరిష్కారానికి అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని బీజేపీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పలు కాలనీలో పర్యటించి పారిశుద్ధ్య సమస్యలు పరిశీలించారు. ఈ మేరకు పలు మురుగు కాలువలు పొంగిపొర్లుతున్నాయని వీటిపై మున్సిపల్ కమిషనర్కు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమన్నారు. ఇదే మురుగు కాలువలో పారిశుద్ధ్య కార్మికుడు మృతి చెందినా అధికారుల్లో చలనం లేదని వాపోయారు. సమస్యను పరిష్కరించకుంటే మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కొండాపూర్ ఏఈ ఎస్.రంగారెడ్డి తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాతాభవనేశ్వరీ కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలోని మాతాభవనేశ్వరీ కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గచ్చిబౌలి ఏఈ పరిధిలో..

మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని గచ్చిబౌలి ఏఈ భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు పద్మశ్రీ గార్డెన్స్, జీపీఆర్ఏ క్వార్టర్స్, గచ్చిబౌలి, ప్రశాంత్‌హిల్స్, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జర్నలిస్ట్ కాలనీలో విద్యుత్ ఉండదన్నారు. అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గౌలిదొడ్డి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

వేమన కాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలో..

చందానగర్: వేమన కాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.

- భవానీపురం ఫీడర్ పరిధిలో భవానీపురం, రెడ్డి కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, శంకర్‌నగర్, ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో అర్జున్‌రెడ్డి కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్, ఫ్రెండ్స్ కాలనీ, గౌతమీనగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండన్నారు.

హఫీజ్‌పేట్, పాపిరెడ్డి, మదీనాగూడ సబ్‌స్టేషన్ల పరిధిలో..

హఫీజ్‌పేట్, పాపిరెడ్డి, మదీనాగూడ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

- మార్కెట్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రేమన్‌నగర్, న్యూ హఫీజ్‌పేట్, సీఎం తట దగ్గర ప్రాంతాలలో విద్యుత్ ఉండన్నారు.
- హనుమాన్ టెంపుల్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మైత్రీ నగర్, ఆల్విన్ కాలనీ, కల్కి అపార్ట్‌మెంట్స్, మదీనాగూడ విలేజ్ కొంతమేర ఏరియాలలో విద్యుత్ నిలిపివేస్తున్నామన్నారు.
- ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్ర 5 గంటల వరకు ఇంద్రారెడ్డి ఆల్విన్‌కాలనీ, సప్తగిరి కాలనీ, సమత కో ఆపరేటివ్ సొసైటీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ వివరించారు.

ముత్తంగి క్రీడా ప్రాంగణానికి నిధులు

పటాన్‌చెరు టౌన్: తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి గ్రామంలోని క్రీడా ప్రాంగణం అభివృద్ధికి నిధులు కేటాయించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా విస్తరిస్తున్న ముత్తంగి గ్రామ పరిధిలో క్రీడా ప్రాంగణం ఎంతో అవసరమన్నారు. ఇక్కడ క్రీడా కోర్టులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్,



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

మాజీ సర్పంచ్ ఉపేందర్, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్, మేరాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై అవిశ్రాంత పోరు

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నరసింహా

మణికొండ: దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీల ప్రజావ్యతిరేక విధానాలపై అవిశ్రాంత పోరాటం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నరసింహ అన్నారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెమలినగర్ కాలనీలో పార్టీ మండల స్థాయి మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ పెట్టుబడి దారులకు వత్తాసు పలుకుతుందన్నారు. పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా కనీస వేతనాలను పెంచాల్సిన బాధ్యతను విస్మరించిందన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయటంలో తాత్సారం చేస్తుందన్నారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనతో విసిగి కాంగ్రెస్ పాలనలో తమకు న్యాయం జరుగుతుందని ప్రజలు నమ్మి గెలిపించారన్నారు.



నెమలినగర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మండల కమిటీ ఎన్నిక...

సీపీఎం గండిపేట మండల నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా డి.ప్రవీణ్‌కుమార్, సభ్యులుగా ఎం.అశోక్, మహిపాల్ యాదవ్, యాదగిరి, సుభాష్, భారతమ్మ, నాగేష్‌గౌడ్, బి.బాలరాజు, కె. రాజుగౌడ్‌లను ఎన్నుకన్నారు. కార్యక్రమంలో పార్టీ చేవెళ్ల డివిజన్ జిల్లా కమిటీ సభ్యుడు దేవేందర్, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి రుద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పార్కును ప్రారంభిస్తాం

మణికొండ: ప్రజలు ఆరోగ్యంగా, ఆహ్లాదంగా ఉండేందుకు పార్కులు ఎంతో ఉపయోగపడతాయని, 9వ వార్డులో అభివృద్ధి చేసిన పార్కును త్వరలోనే ప్రారంభిస్తామని కౌన్సిలర్ లక్ష్మీప్రవళిక కిరణ్ అన్నారు. తుది మెరుగులు దిద్దుకుంటున్న పార్కు పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... అరుణోదయ కాలనీలో ఉన్న పార్కు స్థలాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. ఇందులో వాకింగ్ ట్రాక్, యోగా వేదిక, పిల్లలకు ప్లే ఏరియా, ఓపెన్ జిమ్‌లతో పాటు పచ్చిక బయళ్లు ఉన్నాయన్నారు. నార్సింగి గ్రామస్థులతో పాటు అరుణోదయ కాలనీ, ఆనంద పాయెట్రీ గేటెడ్ కమ్యూనిటీల వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. పార్కును ప్రజలంతా ఉపయోగించుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. స్థానిక నేత వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గట్టి చర్యలు వట్టి మాటలే!

మొద్దు నిద్రలో రెవెన్యూ యంత్రాంగం

- రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడుకోవడంలో అలసత్వం
- కళ్లెదుటే కబ్జా... ఉలుకూపలుకూ లేని రెవెన్యూ అధికారులు
- సుల్తాన్‌పూర్ కబ్జాదారులపై చర్యల్లేవంటున్న స్థానికులు



జేసీబీతో సుల్తాన్‌పూర్ భూముల ఫెన్సింగ్‌ను తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)

పటాన్‌చెరు: కళ్లెదుటే సర్కారు భూముల్ని అక్రమార్కులు కబ్జా చేస్తున్నా అమీన్పూర్ రెవెన్యూ అధికారులు మాత్రం మొద్దు నిద్రను వీడటం లేదు. కబ్జాదారులు చేస్తోన్న భూ దందాపై ఎవరైనా ఫిర్యాదు చేసినా తూతూమంత్రంగా చర్యలు తీసుకుని అక్రమార్కుల్ని వదిలిపెట్టేస్తున్నారు. అధికారుల అలసత్వాన్ని అలుసుగా తీసుకుని భూ కబ్జాలను యథేచ్ఛగా చేసుకుంటున్న అక్రమార్కులపై చర్యలేవని ఓ వైపు స్థానికులు నిలదీస్తున్నా అధికారుల నుంచి ఉలుకూపలుకూ లేదు. అందుకు సుల్తాన్‌పూర్ గ్రామపరిధిలో జరుగుతున్న అక్రమార్కుల భూకబ్జా, అమీన్‌పూర్ అధికారుల నిర్లక్ష్యమే నిదర్శనంగా నిలుస్తోంది.

లే అవుట్ వేసి విక్రయిస్తున్నా...

సుల్తాన్పూర్ గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 30లో కబ్జాదారులు పథకం ప్రకారం వంద ఎకరాల విస్తీర్ణంలో ఎత్తైన కొండలపై మట్టిపోసి జేసీబీలతో రోడ్లు వేసి లే అవుట్‌లు వేసి విక్రయిస్తున్నారు. అదేవిధంగా అమీన్పూర్ పట్టణం, మండల పరిధిలో అసైన్డ్, ప్రభుత్వ భూములే కాకుండా డీఆర్‌వో కస్టోడియన్ భూములు, చెరువు భూములు పెద్ద ఎత్తున కబ్జాకు గురవుతున్నాయి. ఇక బీరంగూడ గుట్ట పరిసరాల్లో సర్వే నంబర్ 993లో ప్రభుత్వ భూములు కబ్జా చేశారని స్థానిక బిల్డర్లకు అమీన్పూర్ తహసీల్దార్ నోటీసులు జారీ చేశారు. అమీన్పూర్ పట్టణ మండల ప్రాంతాల్లో ఎకరా భూమి విలువ రూ.25 కోట్ల పైమాటే. అత్యంత విలువైన ప్రభుత్వ భూములను రాజకీయ నాయకుల అండదండలతో కబ్జాలు చేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ యంత్రాంగం విఫలమైందనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఇదే విషయం పత్రికల్లోనూ వచ్చి, సామాజిక మాధ్యమాల్లో కూడా బాగా వైరల్ కావడంతో రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేపట్టి జేసీబీతో ఫెన్సింగ్ తొలగించి చేతులు దులుపుకున్నారే తప్ప అసలైన అక్రమార్కుల భరతం పట్టలేదు. సుల్తాన్పూర్ సర్వే నంబర్ 30 కబ్జాలపై తహసీల్దార్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

చర్యలు తీసుకుంటాం

సుల్తాన్పూర్ భూ కబ్జా వ్యవహారంపై విచారణ జరుగుతోంది. అక్రమార్కులను గుర్తించి క్రిమినల్ కేసులు పెడతాం. అమీన్పూర్ ప్రభుత్వ భూములు కాపాడేందుకు చర్యలను తీసుకుంటాం.

– రవీందర్ రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి, సంగారెడ్డి